# సౌఖ్యాన్వేషణ

కొమ్మూరి ఉషారాణి
బి. ఎ., బి. ఎల్.

"అమ్మా! పక్కయింటి వనజలాగ నాకూ జడకుప్పలు పెట్టుకోవాలనుందే! కొనిపెట్టవూ?"

"ఇప్పుడు కాదమ్మా!"

"ఏం? ఎందుకని?"

"మన దగ్గిర అంత డబ్బులేదు. మనం బీద వాళ్ళం"

కామాక్షమ్మ చెరచర వంటింట్లోకి వెళ్ళి పోయింది. లలిత ఆమె వెళ్ళిన వేపే ఓ రెండు క్షణాలు మౌనంగా చూసింది. తర్వాత నెమ్మదిగా లేచివెళ్ళి కిటికీదగ్గిర నిలబడింది. బైట మఱ్ఱిచెట్టుకింద ఎంతోమంది పిల్లలు దాగుడు మూతలు ఆడుకుంటున్నారు. ఆ పిల్లల నవ్వుల గలగలలు, ఆటపాటలు లలితని ఆనందంలో ముంచేయలేదు. లలిత బుఱ్ఱలో రకరకాల ఆలోచనలు పరుగెడుతున్నాయి.

'తనకి ఓవస్తువు కావాలి. అది లభించేందుకు తను చేయగలిగిందేమీ లేదా? అమ్మ ఏమో బీదవాళ్ళం, లేనివాళ్ళం అంటుంది? ఆ బీదరికం పోవటమెలాగ? పోనీ, ఎన్నాళ్ళకి పోయి, తను హాయిగా తనకి కావలసిన వస్తువులు పొంద గలదు?' లలిత గుండె బరువుగా మూలిగింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

ప్రపంచంలోని సమస్త అన్యాయాలనీ తార్కిక దృష్టితో విమర్శించి, వాపోయే దుఃఖం కాదు అది. ఆ రేళ్ళ పసి హృదయపు ఆవేదన అది. ధర్మాధర్మాలకి నిర్వచనం తెలియని లేతమనసు అది. తనకి ఎంతో కావాలనుకున్న వస్తువు లేకుండా పోయిందే అని బెంగపడిన అమాయక కన్నీళ్ళవి.

ఆ హృదయారాటాన్ని, కన్నీళ్ళని తల్లి ఈ విధంగా తుడిచేయ ప్రయత్నించింది. "పిచ్చి పిల్లా! అవి కావాలి, ఇవి కావాలి అని మారాం చేసి బెంగపెట్టుకో కూడదు. ఈ ప్రపంచంలో మనకి ఎన్ని కావాలీ అని కోరుకుంటామో, దానికి రెట్టింపు దుఃఖము, అశాంతీ మిగులుతాయి చివరికి." కామాక్షమ్మ ఆ మాటలు చెబుతున్నప్పుడు కూతురి ముఖంకేసి చూడ లేదు. ఆ రేళ్ళ లలిత వాటిని అర్థం చేసుకో గలుగుతుందా లేదా అని ఆలోచించలేదు. తన ఆత్మ శాంతికోసమే ఆ మాటలిని పైకి గట్టిగా అని తృప్తిపడింది. భగవంతుడు తనపట్ల చూపిన నిర్దయనీ, అన్యాయాన్ని కూతురికి చెప్పాలనీ, ఆ బాధ కూతురితో పంచుకోవాలనీ తల్లి ఆరాటం. కానీ ఏ వాక్యం ప్రారంభించినా, లలిత లేతవయసు జ్ఞప్తికి వచ్చి మాటనిలిపేసేది. తన అభిప్రాయాలు, ఆలోచనలు కూతురి మనసు వికలం చేస్తాయేమో! ఆమె భవిష్యత్తు నాశనం చేస్తాయేమో! పోనీ తను కాకుంటే తన కూతురైనా ఎందుకు సుఖపడకూడదు అనుకునేది తల్లి.

కానీ ఆమె ఆశలు ఫలించలేదు. లలిత జీవితంలో ఒక్కొక్క వసంతం, ఒక్కొక్క కోరికనీ, ఆశనీ, ఉత్సాహాన్ని పెంచుతూ వచ్చింది. ఆమె చిలిపి కళ్ళు, లేత పెదవులు, గులాబీరంగు చెక్కిళ్ళు, కొత్త ఆనందాన్ని, శోభనీ పులుముకున్నాయి. లలితకి రంగురంగుల బట్టలు కట్టుకోవాలనిపించింది. రకరకాల నగలు వేసుకోవాలని కోరిక కలిగింది. తన తోటి స్నేహితురాళ్ళలో [illegible]

కోవాలనిపించింది. అవన్నీ లభించనందుకు ఆమె బెంగపడి కృశించిపోలేదు. ఆమెకళ్ళల్లో ఎప్పుడూ ఏవేవో కలలు నాట్యమాడేవి. ఆమె మనసు ఏవో తెలియని సౌఖ్యాలకోసం ఆరాట పడేది. ఆమె హృదయం ఆమె నిజపరిస్థితిని దాటి కొన్ని వందలమైళ్ళు దూరంగా పరుగెత్తిపోయేది.

అంతే కాదు; తన లేమితనం, దారిద్ర్యం భగవంతుడు తన ముఖానరాసి పెట్టాడు అనుకోలేదు లలిత. ఏవో బలవత్తరమైన బాహ్య శక్తులు, పరిస్థితులు తన దురదృష్టాన్ని లిఖించాయని తెలుసుకోలేదు లలిత. తన దారిద్ర్యం ఏదో కృత్రిమమైనదిగా తోచింది ఆమెకి. అందుకనే ఓనాడు సంతకి వెళ్ళినప్పుడు, ఎంతో నిర్భయంగా, చులాగ్గా ఓ గాజుల జతని దొంగిలించింది. ఆ విషయం తెలిసి కామాక్షమ్మ చాలా బాధపడింది. లలితని తిట్టింది. కొట్టింది. ఇక ఎప్పుడూ అలాటి పనిచేయనని ఒట్టు పెట్టించుకుంది.

కానీ లలితకి ఆ గాజులు తొడుక్కున్నప్పుడు చాలా ఆనందమేసింది. దాన్ని నలుగురూ బాగుందని మెచ్చుకున్నప్పుడు గర్వమేసింది. "ఛీ! ఛీ! నేను ఎంత నీచపు పనిచేశాను!" అని లలిత ఆత్మ పరిశీలన చేసుకోలేదు. "ప్రపంచంలో ఇంతమంది యిన్నిన్ని సుఖాలు అనుభవిస్తున్నారే! నాకే ఎందుకు ఈ నికృష్టపు బ్రతుకు? నేను ఎటువంటి పాపం ఎరుగనే? అలాటిది నేను చేయని నేరానికి ఎందుకు శిక్ష అనుభవించాలి? కొట్టువాడి దగ్గిర అన్నేసి గాజులున్నాయే! నేను రెండు ఎత్తుకొచ్చినంత మాత్రాన వాడికి వచ్చిన నష్టమేమిటి? అయినా నేను గాజులు తీసేయడం ఎవరూ చూడలేదుగా. ఫరవాలేదు. పోనీ! అమ్మ అంతగా అడిగింది కనుక, యిదే మొదటిది, ఆఖరిది. ఈమాటు యిక ఎవరి వస్తువూ ముట్టుకోను" అనుకుంది.

కానీ ఆ 'చిన్న' చాపల్యం లలితని ఒ పట్టాన [illegible] ఆమెని అంటిపెట్టుకొని రోజురోజుకీ హెచ్చు కాసాగింది. ఇతరుల వస్తువులు అపహరించేందుకు కొంత చురుకుదనం, జాగ్రత్త వుంటే చాలునని గ్రహించింది లలిత. ఆ విషయం ఆమెకి చాలా ఆనందాన్నీ, ఉత్సాహాన్నీ యిచ్చాయి. మనసులో కొత్త ఆశలు చిగుర్చాయి. కామాక్షమ్మకి కూతురి స్వభావం అర్థంకాలేదు. "భగవాన్! నా కూతురికి పాపభీతినీ, దైవభీతినీ కలుగజేయి" అనే ప్రార్థించింది. కానీ భగవంతుడు ఆమె ప్రార్థనలని ఆలకించలేదు.

తల్లి మతం రుచించక, ప్రపంచంలో తనలాగే లేమి తనంతో జీవిస్తున్న వారి మనస్తత్వాన్ని అర్థంచేసుకోలేక, మానవ విలువలలో విశ్వాసం నశించి, చిత్రమైన మానసికావస్థలో వున్న లలితని ప్రణయాలు చుట్టుకున్నాయి. పాపభూయిష్టమైన ఈ జగత్తులో ప్రేమించే హృదయాలు కూడా వుంటాయా అనుకుంది లలిత. అందుకనే శేఖర్ అనే యువకుడు, "నిన్ను రోజుకి ఒక్క సారయినా చూడకుంటే వుండలేను. అలా చూస్తావేం? నా బాధ అర్థం చేసుకోలేవూ?" అని బతిమాలినప్పుడు, ఆలోచనా పూర్వకంగా తల వొంచుకుంది. కానీ కాలక్రమాన తనలో కూడా అలాంటి అనుభూతి ఏదో కలుగుతోందని తెలుసుకుంది. ఆ మాట అతనితో చెప్పింది. శేఖర్ సంతోషంతో ఉక్కిరి బిక్కిరయాడు.

కానీ లలిత అతని సంతోషాన్ని పంచుకోలేక పోయింది. ఆమెలో ఓ వింత సంఘర్షణ ప్రారంభమయింది. తన తల్లి తండ్రుల గతచరిత్ర, చిన్ననాటి నుంచీ తనలో పెంపొందుతున్న చాపల్యం, అతను ఎక్కడ పసికట్టి, మనసు మార్చుకుంటాడో అని అల్లల్లాడి పోయింది. తన సహజ ప్రవృత్తీ, దౌర్బల్యాలూ, అతనికి తెలియకూడదనే తాపత్రయంలో, అతనికి దగ్గిరగా రావటంపోయి, మరింత దూరం కాసాగింది.

శేఖర్ చాలా తెలివిగలవాడు. సూక్ష్మగ్రాహి. ముక్కుకు సూటిగా పోయేనైజం గల

వాడు. "నా దగ్గిర ఎందుకంత జంకుగా వుంటావు? నీ గురించి నాకు ఎంతో తెలుసుకోవాలని వుంది. నాతో హృదయం విప్పి మాట్లాడవేం?" అనడిగాడు ఎన్నో సార్లు లాలనగా. ఆ ప్రశ్నలు లలితని మరింత కలవర పెట్టేవి.

ఇక వారి వివాహానికి కొద్ది రోజులున్నాయనగా, ఒక రోజు లలితా శేఖరులు ఓ విందు భోజనానికి వెళ్లారు. అది కమలమ్మ అనే ఒక కలిగిన వారింటి గృహప్రవేశ మహోత్సవం. రంగురంగుల దీపాలతో, అలంకరణలతో యిల్లు కిటకిటలాడుతోంది. లలిత ఒక వాయిల్ చీర కట్టుకుంది. చేతికి రబ్బరు గాజులు తొడుక్కుంది. మెళ్ళో పూసల దండ వేసుకుంది. శేఖర్ ఓ నూలు చొక్కా,పాత పంట్లాము తొడుక్కున్నాడు. నిజానికి ఆ జనం మధ్య, వారిద్దరూ కాస్త 'విడిగా' కనపడు తున్నారు. లలితకి ఆ విడిపడిపోవటం ఏ మాత్రం నచ్చలేదు. మనసు చాలా కష్టపెట్టుకుంది. వారి మధ్య నుంచి బైట పడాలని తొందర పడింది. శేఖర్ కి ఆమె నైఖరి బోధ పడలేదు.

కమలమ్మ లలితని చాలా రోజులుగా ఎరుగును. ఆ పిల్లంటే ఆమెకి చాలా అభిమానం, ప్రేమ. లలితా శేఖరులు శలవు తీసుకునేందుకు వచ్చేసరికి, కమలమ్మ చాలా ఆశ్చర్య పడింది. "అదేమిటే పిల్లా! అప్పుడే వెళ్ళిపోతానంటావ్? కాస్త ఫలహారమన్నా తీసుకోవూ?" అంటూ లలితని ఆప్యాయంగా తన పక్కనే కూర్చోపెట్టుకుంది. శేఖర్ సంకోచంగా గుమ్మంలోనే నిలబడ్డాడు. "రా అబ్బాయి! లోపలికి రా" అంటూ ఫలహారం తెచ్చేందుకు కమలమ్మ వంటింట్లోకి దారి తీసింది. "అంత శ్రమ ఎందుకండీ! మేం వెళతాం" అంటూ శేఖర్ ఆమెని అనుసరించాడు.

లలిత తను కూర్చున్న గదిచుట్టూ కలియ చూసింది. నిలువుటద్దం దగ్గిరకి వెళ్లి తన ప్రతిబింబం చూసుకుంది. ఆ రూపు ఆమెకి అయిష్టతని కలిగించింది. అక్కడ నుంచి చరచర కిటికీ దగ్గిరకి నడిచింది. బైట సన్నాయి, గోల ఆమె చెవులకి అపశ్రుతిని పలికాయి. లలిత వెనక్కి తిరిగింది. అక్కడే బల్లమీద ఉన్న ఓ చిన్న దంతపు పెట్టె మీద పడింది ఆమె చూపు. ఎన్నో నగిషీలు చెక్కి వున్న ఆ పెట్టె చూడముచ్చటగా, ఎంతో అందంగా వుంది. లలితలోని కళా హృదయం, ఆ శిల్పచాతుర్యాన్ని, పని తనాన్ని ఎంతో మెచ్చుకుంది. లలిత దాన్ని చేతిలోకి తీసుకుంది. దాని వంక ఆశగా, తృష్ణతో చూసింది. వెంటనే తత్తర పాటుతో అటూ ఇటూ చూసింది. ఆ క్షణంలో ఆమె వివేకం, నీతి నియమాలు ఆమెని ఏకాకిని చేసి వెళ్ళిపోయాయి.

ఇంతలో ముందు శేఖర్ వెనక కమలమ్మ గుమ్మంలో వచ్చి నిలబడ్డారు. లలిత చేతిలోని వస్తువు చూసి శేఖర్ నిర్ఘాంతపోయాడు. లలిత ముఖాన నెత్తురు చుక్కలేదు. బాధతో, అవమానంతో పెదిమలు వణికాయి.

కమలమ్మ పరిస్థితి యిట్టే గ్రహించింది. గబగబ లలిత దగ్గిరకి వచ్చి ఆమె బుజంమీద చెయ్యి వేసింది. "శేఖర్! ఈ బహుమతి ఎలా వుంది చెప్పు? ఏమే లలితా నేను అంత ప్రేమగా యిస్తే తీసుకో సంకోచిస్తున్నావా?" అని పకపక నవ్వబోయింది. శేఖర్ కను బొమలు చిట్లించాడు. అతనిమనసులోని ఎన్నో సంశయాలిని అతని ముఖం తీరే విశదం చేసింది. అతనికి కావలసిన ఎన్నో సమాధానాలు లలిత కనుకొలకులే విప్పిచెప్పాయి.

ఇంటికి వెళ్లేదారిలో ఆమెని ఒక్క ప్రశ్న వేసి వేధించలేదు. ఆమె ఒక్క విషయం చెప్ప ప్రయత్నించి ఆత్మ వంచన చేసుకోలేదు. కానీ ఆ రాత్రి లలిత కమలమ్మని కలుసుకుంది. తన కృతజ్ఞత తెలుపుతూ, ఆమెను కావలించుకు బావురుమంది. "అమ్మా? యిందులో నే చేసిన

త్యాగమేముంది ? ఈ విషయం మర్చిపో" అని బుజ్జగించి పంపేసింది కమలమ్మ.

కానీ లలిత ఆ సంఘటనని ఆమె చెప్పినంత సులభంగా మర్చిపోలేకపోయింది. లలిత మనసులో యిప్పుడు హృదయాన్ని పిప్పిచేసే దుఃఖం లేదు. తన భవిష్యత్తు నాశనమైపోయిందే అనే నైరాశ్యం లేదు. ఒక్కటే కొరత, ఒక్కటే వెలితి, బాధ మిగిలి వుంది. తన మనసుకి యిది శాశ్వతగాయం...తన ప్రేమకి యిక ప్రతిధ్వని లేదు...ఈ క్రూర ప్రపంచం తనకి ప్రేమ అనే అనుభూతిని కూడా లేకుండా చేసింది...శేఖర్ మరిరాడు...మునుపులా తనని ప్రేమించలేడు .. ఆ భయంకర సత్యం ఆమె మనోభావాలనీ, ఉద్రేకాలనీ కొత్త దారులంట పరుగెత్తించింది.

ఆ మర్నాడే లలిత శేఖర్‌ని కలుసుకుంది. "శేఖర్ ! నేను దొంగని. కమలమ్మ నాకు ఆ పెట్టెని బహూకరించలేదు. నేనే దాన్ని దొంగిలించ ప్రయత్నించాను. ఇంతకు క్రితంకూడా నాకు చాలాసార్లు యిలాటి దుర్బుద్ధి కలిగింది. యింకా విను! మా నాన్న ఖూనీకేసులో యిరుక్కుని కొన్నేళ్లు జైల్లో వున్నాడు. మా అమ్మకి యిది...రెండో...పెళ్లి...ఇవన్నీ నీ దగ్గిర దాచి, నిన్ను మభ్యపెట్టి, వివాహమాడి, నేను ఎటూ సుఖపడలేను. నీకూ శాంతివుండదు. నువ్వు మంచి కుటుంబంలో పుట్టావు. విద్యాసంస్కృతులు గలవాడివి. ఈ విశాల ప్రపంచంలో మనిద్దరి దారులు వేరు. మన జీవితాలు కలవలేవు. అసలు నాలాంటివారు ఈ భూమికే భారం. చెప్పు శేఖర్ ! చెప్పు ! ఈ ప్రపంచంలో సౌఖ్యమనేది ఎందుకింత నిర్దయగా పంచబడింది. మనుష్యులు తాము చేయని నేరాలకి కూడా శిక్ష ఎందుకు అనుభవిస్తారు?" అంటూ బావురుమంది లలిత.

శేఖర్ ఆమె తల పైకెత్తాడు. ఆమె కన్నీళ్లు తుడిచాడు. లలితా! ఎందుకలా బాధ పడతావు? నీ తల్లి తండ్రుల దౌర్బల్యాలకి నువ్వు బాధ్యురాలివి కాదు. ఇక నీలోని బలహీనతలని సరిదిద్దుకునేందుకు నీకు అవకాశం లేకపోలేదు. ఈ ప్రపంచం నువ్వనుకున్నంత పాపభూయిష్ఠమైంది కాదు. అధర్మం పక్కనే ధర్మాన్నీ, అన్యాయం పక్కనే న్యాయాన్నీ, కాఠిన్యం ప్రక్కనే కరుణనీ, ద్వేషం పక్కనే ప్రేమనీ సృష్టించాడు భగవంతుడు. లేకుంటే ఈ ప్రపంచం ఎప్పుడో అంతరించిపోయేది. మానవులు యింత ప్రగతిని సాధించేవారు కాదు. నామాట నమ్మ" అంటూ ఆమెని దగ్గిరకి తీసుకున్నాడు. లలిత ఆనంద బాష్పాలతో అతని భుజం తడిసిపోయింది.

---

ఆంధ్ర మహిళా సభ

## పాల పంపకము

జూలై నెలలో పాల పౌడరు పాలు 3546. మందీ బీదపిల్లలకు పోయించితిమి. ఈ పాల పంపకం ప్రతి శని, ఆదివారములలో నాగేశ్వరపురములోను, మిగిలిన రోజులలో ఆంధ్ర మహిళాసభా ఆవరణములోను, ప్రతిదినము ఉదయం 7 గంటలకు జరుపబడుచున్నది.